క్లుప్తంగా

ఎస్‌ఐల బాధ్యతల స్వీకరణ


గోపాలరావు

అరకులోయ రూరల్: అరకులోయ ఎస్‌ఐగా జి.గోపాలరావు సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈయన మోతుగూడెం స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తూ బదిలీపై అరకులోయ ఎస్‌ఐగా వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ సంతోష్ శ్రీకాకుళం జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఎస్‌ఐ గా బాధ్యతలు స్వీకరించిన గోపాలరావు మాట్లాడుతూ అందరి సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అనంతరం సీఐ ఎల్.హిమగిరిని మర్యాద పూర్వకంగా కలిశారు.

కొయ్యూరు ఎస్‌ఐగా నాగార్జున



కొయ్యూరు: కొయ్యూరు ఎస్‌ఐగా వి.నాగార్జున సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దేవిపట్నం ఎస్‌ఐగా పనిచేసిన ఆయన బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన రామకృష్ణను మరో చోటకు బదిలీ చేశారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది నేడు

కొయ్యూరు: మండలంలోని నడింపాలెం, శరభన్నపాలెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఏవో ఉమాదేవి తెలిపారు. రేవళ్ల, చీడిపాలెంలో గురువారం కార్యక్రమం నిర్వహించనున్నామని, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తువుల పంపిణీ


మాట్లాడుతున్న సీడీపీవో విజయకుమారి

కొయ్యూరు: మండలంలోని మర్రివాడ పంచాయతీ దొడ్డవరంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సీడీపీవో విజయకుమారి గ్రామ పరిధిలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు టీవీలు, ఆర్‌వో వాటర్ ప్లాంట్లు, కుర్చీలు, ఫ్యాన్‌లు తదితర సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సర్పంచ్ సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ షణ్ముఖరావు

జి.మాడుగుల: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని లేకుంటే చట్టపరమైన చర్యలు ఉంటాయని ఎస్‌ఐ షణ్ముఖరావు హెచ్చరించారు. పాడేరు–జి.మాడుగుల, చింతపల్లి రోడ్డు మార్గంలో నుర్మతి రోడ్డు జంక్షన్ వద్ద సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమానితులను ప్రశ్నించి వదిలిపెట్టారు. వాహనచోదకులు తమ వెంట రికార్డులు ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో అనుమానస్పదంగా సంచరిస్తుంటే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్కను నాటుతున్న ఎంపీడీవో కిరణ్‌కుమార్, నేతలు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని అంబేడ్కర్ పార్కులో ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో సర్పంచ్ సుభాష్‌చంద్ర, వైస్ ఎంపీపీ సత్యనారాయణ తదితరులు సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా తీసుకోవాలని కోరారు. విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు.

సక్రమంగా పింఛన్లు పంపిణీ

రాజవొమ్మంగి: సామాజిక పింఛన్లను సక్రమంగా పంపిణీ చేయాలని సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో యాదగిరీశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 16 గ్రామ సచివాలయాల ద్వారా 105 మంది సిబ్బందితో పింఛన్ల పంపిణీ చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. అర్హులందరికీ అందజేయాలని సూచించారు.

కొరవడిన పారిశుధ్యం

- చెత్తాచెదారాలతో నిండిన వీధులు
- దుర్గంధంతో అవస్థలు
- పట్టించుకోని అధికారులు


గుంటసీమ రహదారిలో చెత్తకుప్పలు


అరకులోయ ఎన్టీఆర్ గార్డెన్ రహదారిపై పేరుకుపోయిన చెత్త

అరకులోయటౌన్: మండలంలోని గ్రామాల్లో పారిశుధ్యం కొరవడింది. వీధుల్లో ఎక్కడ చూసినా చెత్తచెదారాలు దర్శనమిస్తున్నాయి. ప్రముఖ పర్యాటక ప్రాంతంగా పేరొందిన అరకులోయలో పారిశుధ్యం మచ్చుకైనా కనిపించడం లేదు. వీధులన్నీ చెత్తకుప్పలతో నిండి ఉన్నాయి. ప్రతీ రోజు వీధుల్లో చెత్త సేకరించి డంపింగ్ యార్డులకు తీసుకెళ్లి పారవేయాల్సి ఉన్నప్పటికీ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆ పనులు జరగడం లేదు. ఫలితంగా చెత్త చెదారం పేరుకుపోయి, డ్రైనేజీల్లో పూడికతీత చేపట్టకపోవడంతోనూ తీవ్ర దుర్గంధంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమలు, ఈగలు ఇతరత్రా కీటకాలతో అవస్థలు పడుతున్నారు. రోగాలు ప్రబలుతాయని ఆందోళన చెందుతున్నారు. అరకులోయలోని ఎన్టీఆర్ గార్డెన్ సమీపంలోని అల్లూరి సీతారామరాజు పబ్లిక్ స్కూల్ పరిసర ప్రాంతంలో చెత్త పేరుకుపోయింది. రోజుల తరబడి చెత్త తొలగించకపోవడంతో స్థానికులతో పాటు సమీప లాడ్జీల్లో బస చేస్తున్న పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని, రహదారులంతా చెత్తతో నిండి ఉంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ముక్కుమూసుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలో పారిశుధ్యం మెరుగునకు కృషి చేయాలని కోరుతున్నారు.

చెత్తను తొలగించాలి



ప్రతీ రోజు పంచాయతీ కార్మికులు గ్రామంలో చెత్త సేకరించి సుదూర ప్రాంతాల్లోని డంపింగ్ యార్డుకు తరలించాలి. చెత్త తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. స్థానికులతో పాటు పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడి, ముక్కుమూసుకోని వెళ్లాల్సిన పరిస్థితి. అధికారులు స్పందించి రోజూ వీధుల్లో చెత్త తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

– పి.ప్రసాద్, అరకులోయ

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

చెత్త తొలగింపు మురుగు కాలువలు వాటర్ ట్యాంకులు శుభ్రం చేసేందుకు ప్రత్యేక యాప్ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రతి రోజు పంచాయతీ పరిధిలో చేసిన పనులను ఆ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఎక్కడ మురుగు కాలువలు, వాటర్ ట్యాంకులు శుభ్రం చేయకుండా, చెత్త తొలగించకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవు. పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

– ఎల్ వెంకట్రావు, ఈవోపీఆర్డీ, అరకులోయ

అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి


చింతపల్లిలో సదుపాయాలను ప్రారంభిస్తున్న సర్పంచ్ పుష్పలత, సీడీపీవో రమణి, సిబ్బంది


డుంబ్రిగుడలోని కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీటీసీ గీత, సీడీపీవో నీలిమ తదితరులు

చింతపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలను అత్యాధునిక సదుపాయాలతో తీర్చిదిద్దుతున్నామని చింతపల్లి ఐసీడీఎస్ సీడీపీవో రమణి అన్నారు. మండలంలోని 19 అంగన్‌వాడీ కేంద్రాలకు ఇటీవల ప్రభుత్వం ఆధునికీకరించింది. చిన్నారులకు వివిధ రకాల ఆటవస్తువులతో పాటు పలు రకాల సామగ్రిని పంపిణీ చేసింది. వీటిని సోమవారం చింతపల్లిలో సర్పంచ్ దురియా పుష్పలత చేతుల మీదుగా ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపీటీసీ సభ్యురాలు గీత, ఐసీడీఎస్ సీడీపీవో నీలిమ తదితరులు చిన్నారుల పలు రకాల ఆట వస్తువులను అందజేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సక్షం కార్యక్రమాన్ని టీవీలో వీక్షించారు. అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే ప్రజా సమస్యల పరిష్కారం


ఏచూరి సీతారాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, స్థానికులు

డుంబ్రిగుడ: మండలంలో కండ్రుం పంచాయతీ జాకరవలసలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మహాసభ నిర్వహించారు. నాయకుడు పోతురాజు, సూర్యనారాయణ మాట్లాడుతూ ఉద్యమాలతోనే ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్య కారణంతోనే ప్రభుత్వ వ్యవస్థలు నిర్వీర్యమవుతున్నాయన్నారు. అన్ని రంగాలను ప్రైవేట్ పరం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయన్ని, దీన్ని అడ్డుకునేందుకు అన్ని ప్రజాసంఘాలు, ప్రజలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా ఇటీవల మృతి చెందిన సీపీఎం నేత ఏచూరి సీతారాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు రాంచందర్, జిన్ను, గోవర్ధన్, సద్దు, రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు డిగ్రీ కాలేజీ విద్యార్థులు


ప్రతిభచాటిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్

అరకులోయటౌన్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు అర్హత సాధించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె, భరత్ కుమార్ నాయక్ తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో కళాశాలకు చెందిన పి.పవన్ కుమార్ 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం, టి. గోపాలకృష్ణ లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం సాధించినట్టు చెప్పారు. ఆయా విద్యార్థులు ఈనెల 4,5,6 తేదీల్లో రాజమండ్రిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఆయా విద్యార్థులను కళాశాల స్పోర్ట్స్ ఇన్‌చార్జి పసుపులేటి నాగబాబు, పీడీ అప్పారావు, సిబ్బంది తదితరులు అభినందించారు.

లక్ష్యంతో చదివితే ఉత్తమ ఫలితాలు


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ భూషణం

గంగవరం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను ఎస్‌ఐ డి.భూషణం సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కేరీర్ గైడెన్స్‌పై సూచనలిచ్చారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. లక్ష్యంతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఏమైనా సమస్యలుంటే ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. పాఠశాల వసతి గృహంలో వంటశాలను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని, ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

31 మందికి వైద్య పరీక్షలు

రాజవొమ్మంగి: మండలంలోని దోనెలపాలెంలో సోమవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన వైద్యశిబిరంలో 31 మందికి వైద్య పరీక్షలు చేశారు. జడ్డంగి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నాగార్జున ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్యభద్రతపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, దోమ తెరలు వినియోగించాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ సుష్మ, ఏఎన్‌ఎం కృష్ణవేణి, హెల్త్ అసిస్టెంట్ రామిరెడ్డి, 104 డీఈఓ శ్రీనివాస్, పాల్గొన్నారు.

పంటలకు తెగుళ్లతో రైతుల సతమతం


వరి పైరుపై మందులు పిచికారీ చేస్తున్న రైతులు

రాజవొమ్మంగి: మండలంలో ఖరీఫ్ వరి పైరుపై వైరస్, సుడిదోమ, మొదలు కుళ్ళు తదితర తెగుళ్లు ముప్పేట దాడి చేస్తున్నాయి. వైరస్ కారణంగా వరి పైరు పసుపు, ఆరంజ్ రంగులోకి మారిపోవడంతోపాటు, మొక్క ఎదుగుల నిలిచిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెగుళ్ల కారణంగా దిగుబడి గణనీంగా తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. తెగుళ్లను అరికట్టేందుకు రకరకాల మందులు కొనుగోలు చేసి పిచికారీ చేస్తున్నామని రైతులు చెబుతున్నారు. తెగుళ్ల బెడద వల్ల ఆర్థిక భారం పెరుగుతోందని, దిగుబడి తగ్గుతోందని, భూసారం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు స్పందించి పంటను కాపాడుకొనేందుకు సలహాలు, సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం వరికి సోకిన తెగుళ్ల వల్ల ఆకులు ఎరుపురంగులోకి మారడంతో పంట ఎదుగుదల నిలచిపోయిందని రైతులు వాపోతున్నారు. ఎన్ని మందులు పిచికారీ చేసినా ప్రయోజనం కానరావడం లేదని, సంబంధిత వ్యవసాయాధికారులు నివారణ సలహాలు, సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక వ్యవసాయాధికారి రమేష్‌నాయుడు వద్ద ప్రస్తావించగా తమ సిబ్బంది క్షేత్రస్థాయిలో వెళ్లి పంటలను పరిశీలించి, రైతులకు సూచనలిస్తున్నారన్నారు. తెగుళ్ల నివారణకు విచ్చలవిడిగా యూరియా వంటి రసాయన ఎరువులు వాడవద్దని హితవు పలికారు. పంటలకు సోకిన తెగుళ్ల నివారణకు వ్యవసాయ సూచనలు పాటిస్తు పంటను రక్షించుకోవాలని కోరారు.

కూటమి ప్రభుత్వంలో గ్రామ వలంటీర్లకు అన్యాయం


మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

పాడేరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఉన్న గ్రామ వలంటీర్లను కూటమి ప్రభుత్వం విధులకు తీసుకోకపోవడంతో పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థతో ప్రజలందరికీ మేలు జరిగిందన్నారు. ప్రజా సేవలందించే వలంటీర్లపై చంద్రబాబు నాయుడు తప్పుడు వ్యాఖ్యలు చేశారని గుర్తుచేశారు. అయితే ఎన్నికల ముందుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రామ వలంటీర్లకు రూ.10వేలు ఇస్తామని అబద్ధపు హామీ ఇచ్చారన్నారు. గ్రామ వలంటీర్లకు తీరని అన్యాయం చేశారన్నారు. సూపర్ సిక్స్ పేరుతో కూటమి ప్రభుత్వం వందరోజుల్లో ఒక్క పథకం అమలుచేయకపోవడం దారుణమన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం


ఎంపీపీ, ఆర్.ఉషారాణి

అరకులోయ రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనలో ప్రజలకు చేసిందేమి లేదని అరకులోయ ఎంపీపీ రంజపల్లి ఉషారాణి తెలిపారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని సీఎం చంద్రబాబు నేటికీ అమలుచేయలేదన్నారు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను నమ్మించి మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలు అమలుచేయలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు అరాచక పాలన సాగిస్తున్నారని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో ప్రజలే తగిన విధంగా బుద్ధి చెబుతారన్నారు.

సమస్యలపై కలెక్టర్‌కు వినతి

మారేడుమిల్లి : గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చావడికోట, గుర్తేడు, పాతకోట సర్పంచ్‌లు సోమవారం రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ దినేష్ కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఇందులో భాగంగా మండలంలోని బోడ్లంక గ్రామ సమీపంలోని పెళ్లిరేవు వాగు, ఆకుమామిడి కోట గ్రామం వద్ద ఉన్న వాగులపై బ్రిడ్జిలను నిర్మించాలని, ఆకుమామికోట నుంచి పాతకోట వరకు మధ్యలో నిలిచిపోయిన రోడ్డును పూర్తిచేయాలని, బోడ్లంక గ్రామంలో సామాజిక భవనం నిర్మించాలని, తేనేల మామిడి గ్రామానికి సీసీ రోడ్డు నిర్మించాలని, కొత్తవీధి గ్రామంలో అసంపూర్తిగా ఉన్న రోడ్డును పూర్తి చేయాలని వినతిలో పేర్కొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


వై.రామవరంలో సామూహిక సీమంతం నిర్వహిస్తున్న సిబ్బంది

వై.రామవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీవో వై.సుధ అధ్యక్షతన నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమంలో ఎంపీపీ కె.ఆనందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీడీపీవో సుధ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా రోజూవారీ ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. చిన్నారులకు అన్నప్రాశన, సామూహిక సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఆకుకూరల, ఇతరత్రా పౌష్టికాహారాలతో తయారు చేసి కూరలు తదితర వంటకాలతో విందు ఏర్పాటుచేశారు. ఎంపీటీసీ సభ్యురాలు వీరమళ్ళ సుబ్బలక్ష్మి, సర్పంచ్ పల్లాల రాజేశ్వరి, తహసీల్దార్ కె.అనసూయ, ఎంఈవో కె.తాతబ్బాయిదొర, నాయకులు కనకరాజు, అంగన్‌వాడీ సూపర్వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్త బేబిరాణి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

డుంబ్రిగుడ: మండలంలోని అరకు గ్రామంలో రూ. 20 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు చటారి జానకమ్మ నిధులు రూ.10లక్షలతో రోడ్డు పనులు రెండు విడతలుగా చేయనున్నట్టు తెలిపారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే గ్రామాలకు ఏళ్ల నాటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఎంపీపీ బాకా ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, నాయకులు అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీలు ఆనంద్, లలిత, సర్పంచ్‌లు శారద, నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు వరాలమ్మ, నాయకులు అశోక్ కుమార్, లీలారాణి, కృష్ణారావు, రామ్మూర్తి, ఏఈఈ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి


కొర్రా రాధిక

అరకులోయ రూరల్: పంచాయతీ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కొత్తభల్లుగుడ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మహిళ విభాగ జిల్లా అధికార ప్రతినిధి కొర్రా రాధిక అన్నారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు వంద రోజులు పైబడినా గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి పనులు జరగలేదన్నారు. గన్నెల జంక్షన్ నుంచి చాపరాయివలస వరకు మంజురైన రహదారి పనులు పూర్తిస్థాయిలో జరగలేనట్టు తెలిపారు. అధికారుల పర్యవేక్షణ లేక గతంలో ప్రారంభమైన రహదారులు, వివిధ అభివృద్ధి పనులు నత్తనడక సాగుతున్నాయన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభు త్వం పూర్తిగా విఫలమైందన్నారు. అబద్ధపు హామీలతో ప్రజలను నట్టేట ముంచిందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరై ప్రారంభమై అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

ప్రకృతి సాగుపై అవగాహన


జీవామృతాన్ని తయారుచేస్తున్న రైతులు

రాజవొమ్మంగి: మండలంలోని వాతంగిలో ప్రకృతి వ్యవసాయంపై ఎంసీఆర్పీ అప్పలరాజు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరికి సోకిన సుడిదోమ తెగుళ్ల సమస్యను తూటికాడతో తయారుచేసిన కషాయంతో నియంత్రించవచ్చన్నారు. 10కిలోల తూటికాడ, 15 లీటర్ల ఆవు మూత్రంతో తయారుచేసిన కషాయాన్ని బాగా వేడి చేసి, చల్లారిన తరువాత వంద లీటర్ల నీటితో కలిపి ఎకరా పైరుపై పిచికారీ చేయాలని సూచించారు. సీఆర్పీలు లోవరెడ్డి, సత్యనారాయణ, వీవోఏ చంటిబాబు రైతులు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు పనులు ప్రారంభం


రాకాసిరాయి వద్ద కల్వర్టు పనులు

ముంచంగిపుట్టు: మండలంలోని కర్రిముఖిపుట్టు పంచాయతీ రాకాసిరాయి గ్రామ వద్ద కల్వర్టు ఇటీవల కుంగిపోయి, ప్రమాదభరితంగా మారింది. దీంతో పిఆర్ అధికారులు కల్వర్టును పూర్తిగా కూలిచ్చేశారు.పంచాయితీ రాజ్ నిధులు రూ.10లక్షలతో రాకాసిరాయి వద్ద నూతన కల్వర్టు నిర్మాణం పనులు మొదలు పెట్టారు. గత రెండు రోజులుగా పనులు జోరుగా జరుగుతున్నాయి. దీంతో ముంచంగిపుట్టు నుంచి కుమడ వెళ్లే మార్గంపై రాకపోకలను అధికారులు నిలిపివేశారు. ప్రస్తుతం ముంచంగిపుట్టు నుంచి కుమడ, రూడకోట, భూసిపుట్టు, బాబుశాల పంచాయతీల్లోని గ్రామాలకు వెళ్లే వాహనదారులు కర్రిముఖిపుట్టు పంచాయతీ కేంద్రం నుంచి మొక్కపుట్టు, తాంగుల గ్రామాల మీదగా ఆయా గ్రామాలకు వెళ్లాలని అధికారులు తెలిపారు. వారం రోజుల్లో కల్వర్టు పనులు పూర్తవుతాయని, అంతవరకు రాకపోకలు నిలిపివేస్తున్నామని, వాహనదారులు సహకారించాలని కర్రిముఖిపుట్టు సర్పంచ్ పుల్‌మొత్తి, అధికారులు కోరారు.

వైఎస్సార్‌సీపీకి ప్రజల మద్దతు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలో ఎంపీపీ బోయిన కుమారి అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ కుమారి మాట్లాడుతూ కన్నతల్లి లాంటి వైఎస్సార్‌సీపీకి ద్రోహం చేసి స్వార్థ ప్రయోజనాల కోసం వేరే పార్టీలో చేరడం దారుణమన్నారు. వైఎస్సార్‌సీపీకి ప్రజల మద్దతు ఉందని స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయింపులతో వైఎస్సార్‌సీపీకి ఒరిగేదేమీ లేదన్నారు. స్వార్థప్రయోజనాలు ఆశించే వారిని ప్రజలు ఎప్పటికీ క్షమించరని, రానున్న రోజుల్లో తగిన విధంగా బుద్ధి చెబుతారన్నారు. కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనలో ఒక్క పథకం అమలుచేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు విస్మరించి, అరాచక పాలన సాగిస్తున్నారన్నారు. ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ, నాయకులు రామారావు, బాబీ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ నిర్మించాలని వినతి

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక ఆదివాసీ సంఘం నాయకులు సోమవారం రంపచోడవరంలో జరిగిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. నేషనల్ హైవే పనుల్లో భాగంగా ఇక్కడ ఉన్న మరుగుదొడ్లు, ప్రయాణికుల బస్ షెల్టర్‌లను కూల్చివేశారని పేర్కొన్నారు. దీంతో ప్రయాణికులు ఆరుబయటే బస్సుల కోసం నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. కలెక్టర్ దినేష్‌కుమార్ స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు.